క్లుప్తంగా

సొసైటీని అభివృద్ధి బాటలో నడిపిస్తాం

ఉంగుటూరు: సొసైటీ లాభాలు మరింతగా ఆర్జింప చేసి అభివృద్ధి బాటలో నడిపిస్తామని ది చేబ్రోలు విశాల పరపతి సహకార సంఘం అధ్యక్షుడు కడియాల రవిశంకర్ అన్నారు. నారాయణపురంలో సొసైటీ నూతన పాలక వర్గం కాగుపాడుకు చెందిన కడియాల రవిశంకర్ అధ్యక్షుడిగా, సభ్యులుగా రామచంద్రపురం గ్రామానికి చెందిన గౌతు బాలభాస్కర్, నీలాద్రిపురానికి చెందిన బొట్టు దుర్గరావు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు



నట్టల నివారణ మందులు వేస్తున్న వైద్యాధికారి

దెందులూరు: గొర్రెలు, మేకల సంరక్షణకు నట్టల నివారణ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని పశువైద్య శాఖ పోతునూరు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సీహెచ్ రాములయ్య దొర అన్నారు. శుక్రవారం పోతునూరులో పశు వైద్య శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు లక్ష్యాలకు అనుగుణంగా ఇంకా చేయించుకోవలసిన కొన్ని మేకలు గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా మేకలు, గొర్రెలు, రైతులకు పలు సూచనలు చేశారు.

కూటమి ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు

చింతలపూడి: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేసి, ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు గృహం వద్ద పట్టణ అధ్యక్షుడు కొప్పుల నాగేశ్వరరావు అధ్యక్షతన పట్టణ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో విజయరాజు మాట్లాడుతూ కూటమి వచ్చి ఏడాది పూర్తయినా ఒక్క హామీని నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను ఇంత వరకు ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. మహిళలకు రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ఉచిత బస్సు అని చెప్పి ఇప్పుడు కేవలం జిల్లాలకే పరిమితం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ విభాగం అధక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు సీహెచ్ జ్ఞానారెడ్డి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.చండీప్రియ, నియోజకవర్గ యూత్ విభాగం అధక్షుడు ఎం.దిలీప్, శ్రీనివాసరావు, ఎం.ఇమ్మానియేలు, ఎ.సుబ్బారావు, తుమ్మూరి వెంకట్రామిరెడ్డి, గోలి చంద్రశేఖర్‌రెడ్డి, బండారు గోపి, దోకల రాము, ఎండీ రవూఫ్, సొంటి ఖన్నా, ఎస్.దుర్గారావు, మోహన్‌రావు, డి.పేర్రాజు, ఎస్‌డీ హాజీ, ఇక్బాల్, పి.మాధవరెడ్డి, సురేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత

ఏలూరు టౌన్: పోలీస్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. స్థానిక ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ సిబ్బంది సమస్యలను ఆయన తెలుసుకున్నారు. పోలీస్, ఏఆర్, హోంగార్డుల నుంచి తమ సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు. పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.

మహిళలు, బాలికల భద్రతపై అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో శక్తి దళం సభ్యులు ఏలూరు సెయింట్ ఆన్స్ కాలేజీలో మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కల్పించారు. శక్తి టోల్ ఫ్రీ నంబర్ 79934 85111ను పరిచయం చేశారు. దీనిని అత్యవసర సమయంలో ఎలా వినియోగించుకోవాలో వివరించారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, మహిళలపై వేధింపులు, ఆత్మరక్షణ పద్ధతులపై అభయ వాహనం ద్వారా అవగాహన కల్పించారు. కాలేజీల వద్ద బాలికల పట్ల ఆకతాయిలు వేధింపులు గురిచేస్తున్న విషయాన్ని గమనించి శక్తి దళ సభ్యులు ఏలూరు టూ టౌన్‌లో ఇద్దరిని, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఒక వ్యక్తిని అప్పగించి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబర్లు 112, 1930, సైబర్ నేరాల నివారణకు 1098, బాల్య వివాహాల నివారణ, హక్కుల రక్షణకు 95503 51100 వాట్సాప్ హెల్ప్‌లైన్ (అసాంఘిక కార్యకలాపాల నివారణకు) వినియోగించుకోవాలని సూచించారు.

సార్వా సాగు.. నష్టాలతో ఆరంభం

- అన్నదాతలకు సాగు నీటి కష్టాలు ప్రారంభం
- ఆరంభంలోనే సాగునీరందక నెర్రలు వస్తున్న నారుమడులు
- ఇంజన్లతో నీటిని తోడుకుంటున్న రైతులు



గోదావరి కాలువ కింద పాతూరులో నెర్రలు వస్తున్న నారుమడులు



ఇంజన్లతో నీటిని తోడుకుంటున్న రైతు

భీమడోలు: సార్వా ఆరంభంలోనే అన్నదాతకు సాగునీటి కష్టాలు దాపురించాయి. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంలా మారాయి. గోదావరి కాలువ చెంతనే ఉన్నా ఆయకట్టుకు నీరందక నారుమడులు నెర్రలు వస్తున్నాయంటే వారి పనితీరుకు అద్దం పడుతుంది. దీంతో రైతులు, కౌలు రైతులు కాలువలోని నీటిని ఇంజన్లతో తోడుకొని తడుపుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గోదావరి డెల్టా ప్రాంతంలో సార్వా సీజన్‌లో ఈ తరహాలో నీళ్లను తోడుకోవడంపై రైతులు అధికారులు, పాలకులను బాహాటంగా విమర్శిస్తున్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరులోని ఓ ఆయకట్టుకు కొన్ని రోజులుగా నీరందక ఓ రైతు అద్దెకు ఇంజన్ తెచ్చి తన నారుమడికి కాలువలోని నీటిని తోడుకుంటున్నాడు. ఇప్పటికే వేలాది రూపాయలతో విత్తనాలు కొనుగోలు చేసుకొని రైతన్నలు నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు. అయితే పాతూరులో 72 ఎకరాల ఆయకట్టు నారుమడికి పంట బోదె నుంచి నీరందక నెర్రలు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ సమస్య పరిష్కరించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత దాళ్వాలో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడిన రైతులకు సార్వా సీజన్‌లో ఇలాంటి కష్టాలు తమ చెంతనే ఉండడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. రోజుకు నారుమడిని తడిపేందుకు అదనంగా ఖర్చులు పెట్టాల్సిన దుస్థితి దాపురించిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. రోజుకు ఇంజన్ అద్దెకు రూ.1000, డీజిల్‌కు రూ.500 వెచ్చిస్తున్నారు. నారుమడి ఏపుగా ఎదగకుంటే దిగుమడులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని రైతులు వాపోతున్నారు. గుండుగొలను ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో 30 వేల ఎకరాలకు పైగా సాగు ఉంది. అయితే కొన్ని తూములకు నీరందకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఆక్వా చెరువులకు నీరు సాఫీగా చేరుతున్నాయని రైతులు విమర్శిస్తున్నారు.

గుర్రపుడెక్క, కర్రనాచు తొలగింపు పనులతో ప్రయోజనం శూన్యం

దాళ్వాలో రైతాంగం సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలో గుండుగొలను సెక్షన్ పరిధిలో కాలువలో గుర్రపు డెక్క, కర్ర నాచు పేరుకుపోవడమే కారణమని పాలకుల ఒత్తిళ్ల మేరకు ఇరిగేషన్ అధికారులు వేసవిలో హడావుడిగా జేసీబీలతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి తూడు తొలగింపు పనులను తూతూమాత్రంగా చేసి చేతులు దులుపుకున్నారు. అయితే తాడేపల్లిగూడెం సెక్షన్ పరిధిలో ఈ పనులు చేపట్టలేదు. దీంతో కాలువలో ఒక సెక్షన్‌లో పనులు చేసి, మరో సెక్షన్‌లో పనులు చేయకపోవడంతో చేయని ప్రాంతంలోని గుర్రపు డెక్క, కర్రనాచులు నీటి ప్రవాహానికి కొట్టుకొచ్చి వర్క్ చేసిన ప్రాంతంలో వంతెనల వద్ద చుట్టేస్తోంది. దీంతో నీరు కిందకు ప్రవహించకుండా అడ్డుగా ఉంది. దీంతో రైతులు సాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. మెరక తూములకు నీరు చేరక పంట చేలు నెర్రలు వస్తున్నాయి. దీనికి తోడు వర్షాలు కురవకపోవడంతో పుండు మీద కారం జల్లిన మాదిరిగా మారింది రైతుల పరిస్థితి. రైతులు ఆదిలోనే పడుతున్న సాగునీటి కష్టాలను అధికారులు, పాలకులు శాశ్వతంగా పరిష్కరించాలని రైతులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. గోదావరి కాలువలో మెరక తూములకు నీరందక ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమని, కాలువలోకి కొట్టుకొచ్చిన తూడు, గుర్రపు డెక్క, కర్రనాచు తొలగింపుకు చర్యలు తీసుకుంటున్నామని ఇరిగేషన్ సిబ్బంది అంటున్నారు.

దీనిపై మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీవీ ఉషారాణిను వివరణ కోరగా నారుమడులు నెర్రలు వచ్చిన విషయం నా దృష్టికి రాలేదు. కాలువ కింద మెరక తూముల కింద నారుమడులకు నీరు చేరక పోవడం వలన రైతులు అన్ని విధాలుగా నష్టపోతారు. ఈ విషయంపై వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తాను. సమస్యను ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకోని వెళ్లి పరిష్కారానికి నా వంతు కృషి చేస్తాను.

పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న గోపన్నపాలెం వైద్యాధికారి రోజ్ మేరీ

దెందులూరు: వ్యక్తిగత పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులు నివారించొచ్చని గోపన్నపాలెం వైద్యాధికారి డాక్టర్ రోజు మేరీ అన్నారు. శుక్రవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేలు ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వాతావరణం మారినప్పుడు సీజనల్ వ్యాధులు, ఇన్ఫెక్షన్లు డిప్తీరియా, చికున్ ఫాక్స్, రోటా, మలేరియా వ్యాధులు వస్తాయన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేలు మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న విద్యార్థినీ విద్యార్థులు పరిశుభ్రతతో అంటువ్యాధులు సంక్రమించకుండా వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలన్నారు.

దుర్గమ్మకు పల్లకీసేవ

జంగారెడ్డిగూడెం: పౌర్ణమి తిథిని పురస్కరించుకొని విజయదుర్గమ్మకు పల్లకీ సేవ నిర్వహించినట్లు ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామ్మోహనరావు తెలిపారు. పట్టణ ప్రధాన వీధుల్లో సన్నాయి మేళతాళాలతో వైభవంగా పల్లకీ సేవ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఈమని శశికుమార్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జనాభా పెరుగుదలను నియంత్రించాలి



భీమడోలు: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భీమడోలు: జనాభా పెరుగుదల ప్రాథమిక అవసరాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని మండలంలోని గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి జాహ్నవిరెడ్డి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని జనాభా పెరుగుదల వలన కలిగే సమస్యలు, వాటి పరిణామాలపై శుక్రవారం గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జాహ్నవి మాట్లాడుతూ జనాభా పెరుగుదల వలన ఆహారం, నీరు, వసతి, విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. జనాభా పెరుగుదల వలన కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఇందిర, డీవైహెచ్ఈఓ మధుసూదనరావు, హెల్త్ సూపర్‌వైజర్ రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూళ్లలో..

పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి పి.అరుణజ్యోతి అధ్యక్షతన ఆరోగ్య విస్తరణాధికారి వైవీ లక్ష్మణరావు పర్యవేక్షణలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ అనురాధ, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాసరావు, మావుళ్లమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామంలో ఎంపీహెచ్ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులకు 21 సంవత్సరం, స్త్రీలకు 18 సంవత్సరాల వయసు దాటిన తరువాత వివాహం చేయాలని అలా చేస్తే ఆరోగ్యవంతమైన పిల్లలను ప్రభుత్వ వైద్యశాలల్లోనే సాధారణ ప్రసవాలు జరగేలా ప్రభుత్వ వైద్యశాలలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. గ్రామంలో అన్ని వీధుల్లో ఫ్లెక్సీలు చేత పట్టుకొని నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. పీహెచ్ఎన్ మోహన్‌భాయ్, ఎంపీహెచ్ఎన్ కిరణ్, ఏఎన్ఎం సంధ్య, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



దెందులూరు: ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది



గణపవరం: విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

జనాభా అదుపుతోనే అభివృద్ధి

గణపవరం: జనాభా పెరుగుదలకు అనుగుణంగా వనరులు పెరగవని, అందువలన జనాభా పెరుగుదలను నియంత్రిస్తే అభివృద్ధి సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి మాట్లాడుతూ జనాభా పెరుగుదల వలన అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. సీనియర్ అధ్యాపకులు కేవీ గణేష్‌కుమార్, జి.వెంకటరమణ, పి.భాస్కరరావు, జి.వెంకట్రావు, అనూరాధ, పీవీ రమేష్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: మోసపు హామీలు రాజకీయాల్లో ఎక్కువ కాలం ఉండవని వైఎస్సార్ సీపీ దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ దెందులూరు మండల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయినా ఎన్నికల ముందు అన్ని ప్రచార సభలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిలదీయడంతో ఏంచేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో కూటమి నేతలు ఉన్నారన్నారు. నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, రైతు సాయం ఇలా ఏ ఒక్కటీ అమలు చేయలేదని ప్రజలు గమనించడమే కాక మోసపోయిన విధానాన్ని ఎండగడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అన్ని విభాగాల శ్రేణులు క్షేత్ర స్థాయికి బాబు చేసిన మోసాలను ప్రచారం చేయాలన్నారు. పార్టీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు, దెందులూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం, రాష్ట్ర కార్యదర్శి తొత్తడి వేదకుమారి, కట్టా ఏసుబాబు, జిల్లా కార్యదర్శి కాటి సుధాకర్, డీబీఆర్‌కే చౌదరి, జిల్లా ఉపాధ్యక్షుడు మేక లక్ష్మణరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎలమర్తి రామకృష్ణ, మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, పోతునూరు గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్, నాయకులు తలారి రామకృష్ణ, బత్రాజు సత్యనారాయణ, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సేవా కార్యక్రమాలు అభినందనీయం



పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గణపవరం: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాల్లో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం గణపవరం మండల సరిపల్లె నంబర్–1 మోడల్ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. బువ్వనపల్లి హైస్కూల్‌కు రూ.10 వేల విలువైన నాలుగు సీలింగ్ ఫ్యాన్లు, పది కుర్చీలను హెచ్ఎం సంకు ఏసుబాబుకు అందజేశారు. గణపవరం పట్టణంలోని పోస్టాఫీసు, ప్రాథమిక పాఠశాలలు, ఎస్సీ వసతి గృహాలకు సీలింగ్ ఫ్యాన్లు, ప్లాస్టిక్ కుర్చీలు, నోట్ పుస్తకాలు అందజేశారు. పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 10 మంది విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ ఈపూరి సత్యనారాయణ, క్లబ్ అధ్యక్షుడు వెల్లంకి నరేష్, ఉపాధ్యక్షుడు కాకర్ల వినాయక, కార్యదర్శి కిలారి రవిబాబు, కోశాధికారి కె.సత్యనారాయణ మూర్తి, సభ్యులు విశారద, రావూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం: మండలంలోని నిమ్మలగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో నిమ్మలగూడెం గ్రామానికి కొత్త లైన్ ఏర్పాటు నిమిత్తం ఈ నెల 12వ తేదీ శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కట్టవపాదలగూడెం గ్రామంలో విద్యుతు సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్ పరిధిలో భారీ వర్షాలు, గోదావరి వరదల కారణంగా విద్యుత్ అంతరాయాల పునరుద్ధరణకు డివిజన్ ఆఫీస్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ఈఈ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఏదైనా విద్యుత్ అంతరాయాలు, సహాయం కోసం కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 9491030712కు ఫోన్ చేయాలని తెలిపారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఈఓ శ్రీహరి

కామవరపుకోట: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఎం.శ్రీహరి తెలిపారు. కామవరపుకోట గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ, కొత్తూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. తడి, పొడి చెత్తపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామములో ప్రతి ఇంటికీ వెళ్లి చెత్త సేకరణ చేయాలని, అవసరమైన కొత్త రిక్షాలను కొనుగోలు చేయాలని తెలిపారు. చెత్త సేకరణ విషయంలో ఐవీఆర్ఎస్ ఫోన్‌కాల్ సర్వేలో సచివాలయ పరిధిలో సిబ్బంది పనితీరు బాగోలేకపోవడంపై పరిశీలన చేసి, సిబ్బందికి సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.సరళ కుమారి, ఏవో సత్యవేణి, సర్పంచ్ కరిపోతు అనూష, ఉప సర్పంచి, కార్యదర్శి రవి నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

'పొల్యూషన్' బోర్డు అధికారుల తనిఖీ



నీటి నమూనాలను సేకరిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీని పొల్యూషన్ బోర్డు అధికారులు తనిఖీ చేశారు. ఈ నెల 7న పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే పొగ, గాలి, నీరు, బాయిలర్ ద్వారా విడుదలయ్యే బూడితతో కాలుష్యం పెరిగి తాము ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని శ్రీనివాసపురం గ్రామస్తులు పొల్యూషన్ బోర్డు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం బోర్డు అధికారి కేవీ రావు పామాయిల్ ఫ్యాక్టరీకి చేరుకొని అనలిస్ట్ తేజస్విని, సిబ్బందితో కలిసి నీటి నమూనాలను తీసుకున్నారు. శాంపిల్స్‌ను పరీక్ష చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కాగా ఏపీ కన్జ్యూమర్ రైట్స్ చైర్మన్ ప్రసాద్ మాట్లాడుతూ తాము కూడా నీటి నమూనాలను తెలంగాణలో పరీక్ష చేయిస్తామని తెలిపారు.

తమ్మిలేరు లాకులకు లీకులు

- తుప్పపటి పాడైపోయిన షట్టర్లు
- తూర్పు లాకుల వద్ద పేరుకు పోయిన సిల్టు, చెత్త
- పడమ లాకుల వద్ద పాడైన గేటు
- ఆందోళనలో ఏలూరు నగరవాసులు



పడమర లాకుల గేట్ వద్ద ఇసుక బస్తాలతో వేసిన అడ్డుకట్ట



చెత్తాచెదారంతో నిండిన తూర్పు లాకుల ప్రాంతం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరానికి పడమర వైపు, తూర్పువైపు విస్తరించి ఉన్న తమ్మిలేరు ద్వారా వచ్చే వర్షం, వరద నీరు పూర్తి స్థాయిలో దిగువన కొల్లేరులోకి సాఫీగా వెళ్లేనా అనే ప్రశ్న ప్రజల్లో తలెత్తుతోంది. తూర్పు లాకుల వద్ద పెద్ద మొత్తంలో షిల్ట్, చెత్త పేరుకు పోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా తయారైంది. సీఆర్ఆర్ కాలేజీ సమీపంలో ఉన్న పడమర లాకుల వద్ద కొన్ని చోట్ల గేట్లు పాడైపోయి ఉన్నాయి. పాడైపోయిన స్థానంలో తాత్కాలికంగా ఇసుక బస్తాలు అడ్డువేసి ఉంచారు. పాడైపోయిన గేట్లను బాగు చేసిన దాఖలాలు లేవు. వర్షాకాలం ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రోజుల్లో పెద్దఎత్తున వచ్చే వరద, వర్షం నీరు దిగువన కొల్లేరుకు సాఫీగా వెళ్లేందుకు అవకాశమేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం, జంతు కళేబరాలు వేస్తుండటంతో పాటు తమ్మిలేరు నిర్వహణకు చర్యలు తీసుకోకపోవడం కూడా మరో కారణంగా కనిపిస్తోంది. పెద్ద ఎత్తున గుర్రపు డెక్క, తూడు, చెత్త వంటివి భారీగా పేరుకుపోయాయి. ఈ కారణంగా తమ్మిలేరు ఏటిగట్టు ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలు ప్రతినిత్యం దుర్గంధం మధ్యే ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం తమ్మిలేరు ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని ఏలూరు నగరవాసులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

రెండుగా చీలిన తమ్మిలేరు

చింతలపూడి మండల నాగిరెడ్డిగూడెం ప్రాజెక్టు నుంచి ప్రారంభమైన తమ్మిలేరు ఏలూరు వచ్చే సరికి ఏలూరు – చింతలపూడి మార్గంలోని ఏలూరు ఎఫ్‌సీఐ గొడౌన్స్ వద్ద నుంచి తమ్మిలేరు రెండు పాయలుగా చీలుతుంది. ఒకటి తూర్పు వైపున తంగెళ్లమూడి, ఏటిగట్టు, మార్కెట్ యార్డు రోడ్డు, రైల్వే ట్రాక్ దాటుకుని తూర్పు లాకుల వద్ద కొల్లేరులో కలుస్తుంది. మరో చీలిక అశోక్ నగర్, అమీనా పేట, గ్జేవియర్ నగర్ మీదుగా నగరం మధ్య నుంచి కొత్త బస్టాండ్‌కు సమీపంలోని వంతెన దిగువగా ప్రవహించి పడమర లాకుల వద్ద నుంచి కొల్లేరులోకి ప్రవేశిస్తుంది.

నీటి ప్రవాహానికి ఆటంకాలు

తమ్మిలేరు లాకుల నుంచి వర్షాకాలం కొల్లేరులోకి సాఫీగా వరద, వర్షం నీరు పోయేందుకు ఇబ్బందులు తప్పేలా లేవు. వర్షాకాలంలో పెద్ద ఎత్తున వరద నీరు వస్తున్న సమయంలో తమ్మిలేరులోని అన్ని వ్యర్థాలు నీటి ప్రవాహంతో పాటు కొల్లేరులోకి వెళుతూ ఉంటాయి. మిగిలిన రోజుల్లో వేసిన వ్యర్థాలు ఎక్కడివక్కడ పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. వేసవిలో నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో లాకుల ముఖ ద్వారం వద్ద పెద్ద ఎత్తున మట్టితో కూడిన సిల్టు, చెత్తా, చెదారం పేరుకుపోయి కనిపిస్తున్నాయి. దీంతో వరదల సమయంలో వచ్చేనీరు సాఫీగా కిందకు వెళ్లేందుకు అవకాశం ఉండదనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. చిన్న చిన్న పనులను కూడా ఇరిగేషన్ శాఖ చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైఎస్సార్ సీపీ హయాంలోనే పనులు

తమ్మిలేరు వరదలకు ఏటా ఏలూరు నగరంలోని పలు పల్లపు ప్రాంతాలు నీట మునిగిపోవడం, ప్రజలు నానా అవస్థలు పడుతుండటాన్ని గమనించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తమ్మిలేరు వరద నివారణ చర్యలు చేపట్టింది. తమ్మిలేరుకు పలు చోట్ల రూ.140 కోట్లు వరకు వెచ్చించి రివిట్‌మ్మెంట్‌లు నిర్మించింది. దీంతో ఏలూరు నగరవాసులకు తమ్మిలేరు వరద ముప్పు తప్పింది. ఇక చేయాల్సిందల్లా ఏటా సాధారణ నిర్వహణ మాత్రమే. దీన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో తమ్మిలేరు కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది.

జ్ఞాన సరస్వతి అమ్మవారికి పూజలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో వేంచేసియున్న శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా ఉపాలయమైన శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.